క్లుప్తంగా

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

కె.గంగవరం: విద్యార్థి దశ నుంచే బ్యాంకుల లావాదేవీలపై అవగాహన ఉండాలని కె.గంగవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె.వెంకట దివ్య అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు మండల స్థాయి ఆల్ ఇండియా స్కూల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, బ్యాంకు కార్యకలాపాలు, ఏటీఎంల వినియోగం, రిజర్వ్ బ్యాంక్ తెస్తున్న మార్పులు వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ పోటీలలో శివల ప్రథమ, కె.గంగవరం ద్వితీయ, కూళ్ల తృతీయ స్థానాలు సాధించాయి. వీరికి బ్యాంక్ సిబ్బంది నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందించారు. హెచ్మెం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు ప్రక్కి బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అంగరలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, డీటీ, వీఆర్వో

కపిలేశ్వరపురం: మండలంలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం సంబంధిత అధికారులు పరిశీలించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాల స్థితిగతులను తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బాబా, వీఆర్వోలు తనిఖీ చేశారు. అంగర మార్కెట్ స్కూల్, అంబేడ్కర్ విగ్రహం వద్ద పాఠశాల భవనాలు ఇబ్బందికరంగా మారడంతో ప్రత్యామ్నాయాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

శరవేగంగా డ్రెయిన్ల నిర్మాణం



అంగర కొత్తకాలనీలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు

కపిలేశ్వరపురం: అంగర కొత్తకాలనీలో సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాలనీ లో 391 ప్లాట్లకు గానూ సుమారు 200 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. నాలుగేళ్లుగా వాడకం నీరు వెళ్లే మార్గం లేక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. కచ్చా డ్రెయిన్లతో కాలనీలో అపరిశుభ్రత నెలకొంది. సమస్యను అక్కడి ప్రజలు, గ్రామ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో నిధులు మంజూరయ్యాయి. రూ.6.5 లక్షలతో ప్రధాన డ్రెయిన్ నిర్మాణ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. రూ.5 లక్షలతో మరో డ్రెయిన్ నిర్మాణం జరుగుతోంది. కాలనీలో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు తదితర ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్షతో పూర్తిస్థాయి సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

రాయవరం: ప్రతి కుటుంబానికి పూర్తి స్థాయిలో ప్రభుత్వ సేవలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. కురకాళ్లపల్లిలో బుధవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తొమ్మిది రకాల సేవలను ఉచితంగా అందిస్తుందన్నారు. కుల, ఆదాయ, పుట్టిన తేదీ, మరణం, వివాహం, ఈ-పాస్‌బుక్, ఆధార్ కార్డులో మొబైల్ నంబరు నమోదు, కౌలురైతు కార్డులు తదితర సేవలు ఉచితంగా అందజేస్తారన్నారు. జూలై 1 నుంచి ప్రతి సచివాలయ పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలసి మండల స్థాయి అధికారులతో ఒక టీమ్‌గా ఏర్పడి ప్రతి కుటుంబాన్ని కలవాలన్నారు. అందుకు ముందుగానే ప్రతి కుటుంబానికి అందించాల్సిన సేవల వివరాలను సేకరించుకోవాలన్నారు. సమావేశంలో గ్రామానికి చెందిన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సాగుహక్కు కార్డులతో మేలు

కాజులూరు: కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులతో మేలు జరుగుతుందని శలపాక వీఆర్వో ఎస్వీ గనికమ్మ అన్నారు. సాగుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా బుధవారం తణుకువాడలో జరిగిన రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్డులతో పంట రుణాలు, ప్రభుత్వ రాయితీలు, ఎరువులు, పురుగు మందులు పొందడానికి వీలుంటుందన్నారు.

ర్యాలి ఆలయ అభివృద్ధికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు రాజమహేంద్రవరానికి చెందిన లంకే ధనరాజు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి. కృష్ణ చైతన్య తెలిపారు.

చక్క దిద్దబడి

- ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ
- శరవేగంగా నాడు- నేడు పనులు
- నియోజకవర్గంలో రూ.29.1 కోట్లతో అభివృద్ధి

మండపేట: గతంలో సర్కారు బడి అంటే.. శిథిల భవనాలు.. పెచ్చులూడే పైకప్పులు.. అధ్వాన టాయిలెట్లు.. రాళ్లు లేచిన ఫ్లోరింగులు.. కలుషిత జలాలు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి గంట మోగింది.. సర్కారు బడి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.. నాలుగేళ్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పాఠశాలల స్వరూపమే మారిపోయింది. నాడు- నేడు పథకంతో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తయారైంది. ఈ పథకంలో మూడు విడతల్లో మండపేట నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే తొలి విడతగా మండపేట అర్బన్, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని 59 పాఠశాలలను రూ. 12 .9 కోట్లతో అభివృద్ధి చేశారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రెండో విడతలో రూ.29.1 కోట్లతో 109 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. మండపేట అర్బన్, రూరల్ పరిధిలో 57 పాఠశాలల్లో రూ. 15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాయవరం మండలంలో రూ.ఆరు కోట్లతో 20 పాఠశాలల్లో, కపిలేశ్వరపురం మండలంలో రూ. 8.1 కోట్లతో 32 పాఠశాలల్లో పనులు చేస్తున్నారు. టాయిలెట్స్ విత్ రన్నింగ్ వాటర్, విద్యుద్దీకరణ, పెయింటింగ్స్, ఫర్నీచర్, తాగునీరు, మేజర్, మైనర్ మరమ్మతులు, ప్రహరీలు, గ్రీన్ బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబ్ తదితర నిర్మాణ పనులు చేపట్టారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. రెండో విడత పనులు దాదాపు పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

అర్తమూరులో..

అర్తమూరు శ్రీసత్యభాస్కర జెడ్పీ హైస్కూల్‌లో రూ. 69 లక్షలు, ఎస్సీ కాలనీ, గణపతి నగర్‌లోని ఎంపీపీ పాఠశాలల్లో రూ. 24 లక్షలతో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. హైస్కూల్‌లో అధునాతన వసతులతో బాల బాలికలకు వేర్వేరుగా టాయిలెట్స్ నిర్మించారు. తరగతి గదుల వద్ద గ్రిల్స్, కన్సిల్డ్ వైరింగ్ తదితర పనులు పూర్తికావొచ్చాయి. ఆయా పనులను గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు, యువజన విభాగం నాయకుడు సందీప్‌రెడ్డిలు పరిశీలించారు.



అర్తమూరులో ఆధునిక వసతులతో నిర్మించిన టాయిలెట్స్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు

రూ. కోటితో అభివృద్ధి పనులు



నాడు-నేడు రెండు విడతల్లో అర్తమూరు గ్రామంలోని నాలుగు పాఠశాలల అభివృద్ధికి రూ. కోటి మంజూరయ్యాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థుల కోసం ఆధునిక వసతులతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాం. పేదల విద్యకు ప్రాధాన్యం కల్పిస్తున్నాం.

– గొలుగూరి అన్నపూర్ణ, సర్పంచ్, అర్తమూరు

దాదాపు పూర్తి



ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో వసతుల కల్పనకు నాడు-నేడు పథకం ఎంతో దోహదపడుతుంది. రెండో విడతగా మండపేట అర్బన్, రూరల్‌లో రూ. 15 కోట్లతో 57 పాఠశాలల్లో చేపట్టిన పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. నాణ్యతలో రాజీ లేకుండా పర్యవేక్షిస్తున్నాం.

– ఎస్.రామచంద్రరావు, మండల విద్యాశాఖ అధికారి, మండపేట

యోగాతో ఆరోగ్యవంతమైన జీవనం

మండపేట: యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చని రాష్ట్ర యోగాధ్యయన పరిషత్ మాజీ కార్యదర్శి, ప్రముఖ యోగా గురువు మేడపాటి వెంకటరెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయన్ని అర్తమూరు ప్రజలు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలోని శ్రీసత్యభాస్కర జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి తదితరులు హాజరయ్యారు. పలువురు మాట్లాడుతూ యోగా ద్వారా వేలాది మందిని ఆరోగ్యవంతమైన జీవనం వైపు నడిపించిన ఘనత మేడపాటి వెంకటరెడ్డికి దక్కుతుందన్నారు. తన రచనలతో ఎందరినో చైతన్యవంతుల్ని చేసి స్వగ్రామమైన అర్తమూరుకు మంచి గుర్తింపు తెచ్చారన్నారు. యోగా గురువు వెంకటరెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక జీవితంలో ఒత్తిడిని జయించి మానసిక ఉల్లాసం పొందేందుకు యోగా మంచి సాధనమని అన్నారు. అనంతరం వెంకటరెడ్డిని సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు, ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, రెడ్డి సంఘం నేత కర్రి వీర్రెడ్డి, పారిశ్రామికవేత్తలు మేడపాటి కృష్ణారెడ్డి, కర్రి బాపిరెడ్డి తదితరులు సత్కరించారు. ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య), కోనాల సత్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు చిర్ల శ్రీరామ్‌రెడ్డి, గొలుగూరి సందీప్ రెడ్డి, చిర్ల జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా దోహదపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక రెండో వార్డు పిరమిడ్ ధ్యాన మందిరంలో కౌన్సిలర్ చిట్టూరి సతీష్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువు శ్రీనివాస్‌ను సత్కరించారు. కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, అమలదాసు లక్ష్మి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా పాల్గొన్నారు.



అర్తమూరులో యోగా గురువు వెంకటరెడ్డిని సత్కరిస్తున్న కాయల వెంకటరెడ్డి, సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి

సంపూర్ణ ఆరోగ్యానికి సాధనం

రామచంద్రపురం రూరల్: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణకుమార్ అన్నారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన ఆధ్వర్యంలో పోస్టల్ సిబ్బందితో యోగాసనాలు వేయించారు. హెడ్ పోస్ట్‌మాస్టర్ కురుపూడి విఠల్‌నాథ్, ద్రాక్షారామ సబ్ పోస్ట్‌మాస్టర్ జి.శివయ్య, రామచంద్రపురం, ద్రాక్షారామ ఆఫీసుల సిబ్బంది, భీమేశ్వరాలయ ఈఓ పితాని తారకేశ్వరరావు పాల్గొన్నారు. వెల్ల, మాలపాడు గ్రామాల్లో అమృత్ సరోవర్ చెరువుల వద్ద ఏపీఓ జి.అరుణకుమారి ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులకు యోగాపై వివరించారు. సర్పంచులు వీరబోయిన సూరిబాబు, ఘంటా సుజనప్రియాంక, నాయకుడు నేమాని సంతోష్‌కుమార్, జేఈ కనకలత పాల్గొన్నారు. అంబికపల్లి అగ్రహారంలోని రాజారత్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో యోగా గురువు తొగరు మూర్తి, చైతన్య ఉచిత యోగా శిక్షణా సంస్థ గురువు నరేష్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ జరిగింది. కళాశాల డైరెక్టర్ పవన్, ఏఓ రవీందర్, రామారావు పాల్గొన్నారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో పోస్టల్ సిబ్బందికి యోగా శిక్షణ



రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రాంగణంలో యోగాసనాలు వేస్తూ...

రామచంద్రపురం: యోగా సాధనతో మానసిక దృఢత్వం కలుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీదేవి అన్నారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి హాల్ వద్ద యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాయవరం: వెదురుపాక అమృత్ సరోవర్ చెరువు వద్ద యోగా డే నిర్వహించారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జనపల్లి సుధారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి అత్తిలి గోవిందరాజులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని కపిలేశ్వరపురం, నిడసనమెట్ట, వాకతిప్ప గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధి కూలీలతో యోగాసనాలు వేయించారు. టెక్నికల్ అసిస్టెంట్లు సుబ్రహ్మణ్యం, లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు షేక్ నాగూర్, తణుకు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు



చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న నాయకులు

మండపేట: స్థానిక సంఘం కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. స్కూల్ హెచ్ఎం ముత్యాల మాణిక్యాంబ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 30వ వార్డు కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారన్నారు. అనంతరం చిన్నారులతో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించి జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, పావులూరి శేషారత్నం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంఈఓ-2గా సూర్యనారాయణ



రాయవరం: స్థానిక మండల విద్యాశాఖాధికారి-2గా వై.సూర్యనారాయణ నియమితులయ్యారు. ప్రభుత్వం ప్రతి మండలానికి ఎంఈఓ-2 పోస్టులను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శంఖవరం మండలం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న సూర్యనారాయణ ఇటీవల జరిగిన కౌన్సెలింగ్‌లో రాయవరం మండలానికి నియమితులు అయ్యారు.

పలువురి పరామర్శ

కాజులూరు: కొత్తమంజేరులో గండి నాగరత్నం (95) మృతిచెందగా ఆమె కుటుంబీకులను బుధవారం పలువురు నాయకులు పరామర్శించారు. నాగరత్నం పెద్ద కుమారుడు గండి పాపయ్య సర్పంచ్‌గా గెలుపొంది మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడిగా పనిచేశారు. చిన్న కుమారుడు గండి చినబాబు కొడుకు గండి కిశోర్ ప్రస్తుతం మంజేరు పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, మురళీ, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ కాకతీయ రాజు, డైరెక్టర్ సూరంపూడి భాను తదితరులు నాగరత్నం కుటుంబీకులను ఓదార్చారు. శీలలో మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ దడాల భీమేశ్వరరావు మృతి చెందగా ఆయన కుటుంబీకులను నాయకులు పరామర్శించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి..

కపిలేశ్వరపురం: వెదురుమూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా సింహాచలం పశువుల పాక దగ్ధం కాగా ఆయన్ని పార్టీ నాయకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి బుధవారం పరామర్శించారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు సింహాచలం పశువుల పాకకు నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. బాధితుడిని పట్టాభి ఓదార్చారు. కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, పార్టీ నాయకుడు చోడే సూరిబాబు ఉన్నారు.

కాపు ఐక్యవేదిక చేయూత



వెల్లలో బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న కాపు ఐక్యవేదిక సభ్యులు

రామచంద్రపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇటీవల వెల్ల గ్రామానికి చెందిన యువకులు మృతి చెందగా ఆయా కుటుంబాలకు నియోజకవర్గ కాపు ఐక్యవేదిక సభ్యులు బుధవారం చేయూత అందించారు. మర్రెడ్డి రాజేష్ కుటుంబానికి రూ.50 వేలు ఇచ్చారు. గానుగుల సాయిరామ్ తండ్రి తమకు ఆర్థిక సాయం వద్దని, పేద కుటుంబమైన ఈతా వరప్రసాద్ కుటుంబానికి సాయం అందించాలని కోరడంతో వరప్రసాద్ కుటుంబానికి రూ.2.60 లక్షలు అందజేశారు. కాపు ఐక్యవేదిక సభ్యులు మాగాపు అమ్మిరాజు, ఆళ్ల బుజ్జి, అల్లం బాబూరావు, సంపతి సత్యనారాయణ, నామా వెంకన్నబాబు, చిక్కాల స్వామి, వట్టికూటి ఏసుబాబు, కంచర్ల చక్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కె.గంగవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు చెల్లుబోయిన నరేన్ అన్నారు. బుధవారం భట్లపాలిక గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా అందిన ప్రజలకు లబ్ధిపై పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నరేన్ మాట్లాడుతూ ప్రభుత్వం నవరత్న పథకాల ద్వారా పేదలకు మేలు చేస్తుందన్నారు. పథకాలు అందరికీ అందాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ వంపన నాగమణి, సర్పంచ్ యలమంచిలి పద్మావతి, ఎంపీటీసీ బాలు, సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, కన్వీనర్లు కట్టా తిరుమల, నరాల శ్రీను, మోర్త శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



భట్లపాలికలో పథకాల గురించి వివరిస్తున్న మంత్రి తనయుడు చెల్లుబోయిన నరేన్

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం

మండపేట: స్థానికంగా పరిసరాల శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. వార్డు పర్యటనల్లో భాగంగా బుధవారం 14వ వార్డులో కమిషనర్ టి.రామ్‌కుమార్, కౌన్సిలర్ శెట్టి కల్యాణితో కలసి ఆమె పర్యటించారు. రోడ్ల పక్కన పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తాచెదారాలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యకు సూచించారు. డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, దోమల నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని, వారు తెలిపిన సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, అమలదాసు లక్ష్మి, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ అలీఖాన్ బాబా, మీగడ శ్రీనివాస్, పార్టీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు పాల్గొన్నారు.



పారిశుధ్య నిర్వహణ గురించి స్థానికురాలిని అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

పాడి రైతుల ప్రగతికి కృషి



కూర్మాపురంలో డెయిరీ అసోసియేషన్ సభ్యులతో నేతలు, అధికారులు

రాయవరం: గ్రామాల్లో పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. కూర్మాపురంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా బుధవారం మహిళా పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం వ్యవసాయాన్ని, పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. అనంతరం మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 68 మంది మహిళా రైతులు హాజరు కాగా, 11 మంది సభ్యులతో అసోసియేషన్‌ను నియమించారు. చీఫ్ ప్రమోటర్‌గా అల్లం సుందరమాణిక్యం, ప్రమోటర్‌గా కడలి నాగబాల, సెక్రటరీగా యడ్ల విజయలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి కరుణాకర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ విజయ, ఉప సర్పంచ్ ఈతకోట లక్ష్మణరావు, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటలక్ష్మి, నేతలు పరంశెట్టి వెంకటరమణ మూర్తి, సాదే రామ్మూర్తి పాల్గొన్నారు.

పళ్లాలమ్మ హుండీ ఆదాయం రూ.2.61 లక్షలు

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ ద్వారా 42 రోజులకు రూ.2,61,800 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం పాలకమండలి చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, ఈఓ బొక్కా వీరవెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ తెరచి లెక్కించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు, స్థానిక నాయకులు సబ్బితి సత్యనారాయణ, ఇళ్ల రాంబాబు, కంచుస్తంభం రాంబాబు, కట్టా రాంబాబు, బండారు సత్తిరాజు, దేప్పలపూడి మాధవరావు, బండారు పేర్రాజు, బండారు సత్తిబాబు, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్ధారణపై సమగ్ర సర్వే

ఆలమూరు: కుష్ఠు వ్యాధి నిర్ధారణపై సమగ్ర సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని చొప్పెల్ల పీహెచ్‌సీలో బుధవారం వైద్యాధికారి డి.సువర్చలానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు ఎస్.వెంకటేశ్వరరావు, సీహెచ్ బేబి తదితరులు కుష్ఠు వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కుష్ఠు వ్యాధి రోగులను గుర్తించేందుకు 36 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆ సర్వేలో గుర్తించిన రోగులకు అందుబాటులోకి వచ్చిన డాట్ చికిత్సను అందజేయాలన్నారు. కుష్ఠువ్యాధి నిర్మూలన ధ్యేయంగా పనిచేస్తున్న ఆరోగ్య ఆశ సిబ్బంది తమ వంతు కృషి చేయాలని ఆమె సూచించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ దంగేటి చంద్రకళ పాల్గొన్నారు.

అనపర్తిలో చోరీ

అనపర్తి: స్థానిక భవానీనగర్‌లోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి రూ. 85 వేల చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఫైర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న నల్లమిల్లి వీరవెంకట సత్యనారాయణరెడ్డి స్థానిక భవానీనగర్‌లో తన కుటుంబంతో నివాస ఉంటున్నారు. సత్యనారాయణరెడ్డి తల్లి బుధవారం వేకువజామున లేచేసరికి మెయిన్‌డోర్ తెరిచి ఉండడంతో కుమారుడిని లేపి విషయాన్ని తెలిపింది. దీంతో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించారని నిర్ధారించుకుని పరిశీలించగా బ్యాగులో ఉంచిన రూ. 85 వేలు దొంగిలించినట్లు గుర్తించారు. దీనిపై బుధవారం అనపర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై అబ్బులుదొర కేసు నమోదు చేశారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

మామిడికుదురు: పాశర్లపూడి వైనతేయ వారధిపై నుంచి దూకి కొమరాడ గ్రామానికి చెందిన చెల్లింగి నాగప్రసాద్ (32) ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అతని మృతదేహం బుధవారం సాయంత్రం లభ్యమైంది. బ్రిడ్జికి మూడు కిలోమీటర్ల దూరంలో పాశర్లపూడి వైపు మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి పంపించారు. మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో పాటు మృతుడి భార్య, తల్లి మధ్య తరచూ జరిగే గొడవల నేపథ్యంలో నాగప్రసాద్ మానసిక వేదనకు గురై మంగళవారం బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు.